# అప్పగింతలు

పెళ్ళిపందిట్లో సందడి తగ్గిపోయింది. మంగళసూత్రధారణ అయిపోగానే ఆహ్వానితులందరూ వెళ్ళిపోయారు. సిగిరెట్టు తాగితే బాగుంటుందని అనిపించి హాలు బయటికి వచ్చాను.

పెళ్ళి చూసి ఇంటికి వెళ్ళే అతివల్లా కనిపించాయి ఆకాశాన అక్కడక్కడ, గుంపులు, గుంపులుగా కనిపించే నక్షత్రాలు.

కొంత దూరంలో కూర్చొని వున్నాడు రాఘవరావు, వాడు నా చిన్ననాటి స్నేహితుడు. కూతురు పెళ్ళికి రమ్మని పట్టుపట్టాడు, అందుకే వచ్చాను, మద్రాసు నుంచి.

"ఏంట్రా ఇక్కడ కూర్చున్నావ్"? రాఘవరావుని సమీపిస్తూ ఆశ్చర్యంగా అడిగేను.

"మంచి గాలి వీస్తోందిరా". రాఘవరావు ఓ నిముషము ఆగి అన్నాడు "అయినా నా పని అయిపోయింది కదరా?".

నేను పాకెట్ నుంచి సిగరెట్టు పెట్టి తీసాను.

"తీసుకోరా".

"వద్దురా", రాఘవరావన్నాడు. "అప్పగింతలు యింకా అవలేదు, ఎప్పుడయినా పిలవవచ్చు".

"అప్పగింతలు... అప్పుడే..."

"అవునురా. అప్పగింతలు చేసుకొని, తెల్లవారుజాము బండికే వెళ్ళిపోతారట మొగపెళ్ళివారు".

నేను సిగరెట్టు వెలిగించాను. గట్టిగా పొగపీలుస్తూ అన్నాను.

"చాలా ఘనంగానే చేసావురా పెళ్ళి"

రాఘవరావు ఏమీ మాట్లాడలేదు. "పెళ్ళి కోసం ఖర్చుపెట్టే డబ్బు శుద్ధ దండగని,

ఏ రిజిస్టర్ మేరజో చెయ్యాలనీ లెక్చర్లిస్తూ ఉండేవాడివి, మరి ఇప్పుడేమయిపోయాయిరా ఆ మాటలు?"

"తప్పలేదురా", రాఘవరావు ఆలోచిస్తూ అన్నాడు "కట్నం అక్కరలేదని, పెళ్ళి ఘనంగా చెయ్యాలని, అడిగేరు మగపెళ్ళివారు. తప్పుతుందా మరి? రిటైరైనప్పుడు వచ్చిన డబ్బంతా పెట్టేసానురా".

నాకు రాఘవరావు మీద జాలి వేసింది పెళ్ళికి ఎంత ఖర్చుపెడితే అంత గొప్ప అనేకునే మధ్య తరగతి మనస్తత్వం మీద కోపం కూడా వచ్చింది.

అప్పగింతలకు రమ్మని కబురొచ్చింది

అప్పగింతలయ్యాక అత్తవారింటికి బయలుదేరే కూతుర్ని చూస్తూ వెక్కి వెక్కి ఏడ్చాడు రాఘవరావు. ఎవరు ఎంత ఓదార్చినా దుఃఖాన్ని ఆపుకోలేకపోతున్నాడు.

"ఏంట్రా అది, మరీ చిన్న పిల్లవాడిలాగా?" నేను రాఘవరావు భుజం తడుతూ

మెల్లగా అతన్ని బయటకు తీసికెళుతూ అన్నాను. "మీ ఇంటి పక్కనే ఓ వాటా తీసుకున్నారని చెప్పావు కదరా? మరేందుకు భాదపడతావు"

ఇద్దరం బయటికి వచ్చాం.

ఆకాశంలో అప్పగింతలు అయిపోయాయి. వెన్నెలని మూటకట్టుకొని చంద్రకళ అత్తవారింటికి వెళ్ళిపోయింది.

"నా బాధ అది కాదురా" రాఘవరావు అన్నాడు "జీవితకాలమంతా కష్టపడి ఆర్జించిన సొమ్ము మూటకట్టుకొని వెళ్ళిపోతోంది అమ్మాయి. అబ్బాయి యింకా చేతికి అందిరాలేదు. మరి, మా బ్రతుకులు.." అతని గొంతు బొంగురుపోయింది.

నాకేమనాలో తోచలేదు. చీకటి నిండిన ప్రపంచాన్ని చూస్తూ ఉండిపోయాను.

వెన్నెల అస్తమించింది. మరి ఉదయ మెప్పుడో!

ఆంధ్రభూమి దినపత్రిక